జైపాల్ సింగ్ ముండా జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఆదివాసీ జేఏసీ చైర్మన్ బాబూరావు నాయుడు

జంగారెడ్డిగూడెం: ఆదివాసీ సమస్యలపై రాజకీయ పార్టీలు తమ విధానాన్ని ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ చైర్మన్ టి.బాబూరావు నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం దండమూడి వశిష్ఠ కళ్యాణ మండపంలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆదివాసి జాతిపిత జైపాల్ సింగ్ ముండా 121వ జయంతిని జేఏసీ జిల్లా ఆదివాసీ ఐక్యకార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు .ఈ సందర్భంగా బాబూరావు నాయుడు మాట్లాడుతూ జైపాల్ సింగ్ ముండా స్ఫూర్తితో ఆదివాసీల మేలు కోసం ప్రతి ఆదివాసీ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఆదవాసీ సేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

బుట్టాయగూడెం: నూతన సంవత్సరం 2024కు అన్నివర్గాల ప్రజలు స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాత సంవత్సరం 2023కు గుడ్‌బై చెబుతూ యువత నూతన సంవత్సరం 2024కి ఆహ్వానం పలికారు. మిఠాయిలు పంచుతూ, కేక్ కట్ చేసి తినిపించుకొంటూ కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మరోపక్క చర్చిల్లో క్రైస్తవ సోదర, సోదరీమణులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కాగా ఆదివారం సాయంత్రం మార్కెట్లలో కోలాహలం కనిపించింది. బ్యాకరీలు, పండ్లు, పూలకొట్లు కిటకిటలాడాయి. ఈ సంవత్సరం రంగుల దుకాణాలను కూడా ఎక్కువగానే ఏర్పాటు చేశారు. రాత్రి ప్రతి ఇంటి వాకిళ్ల ముందు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మహిళలు ఉత్సాహంగా పోటీపడి రకరకాల ముగ్గులను వేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

ఏజెన్సీలో న్యూఇయర్ సందడి

కుక్కునూరు: ఏజెన్సీలో ఆదివారం మధ్యాహ్నం నూతన సంవత్సర సందడి నెలకొంది. మండలంలోని బేకరీలు, స్వీట్ షాప్‌లు, కిరాణా దుకాణాలు జనాలతో కిక్కిరిసిపోయాయి. మరోపక్క మాంసం దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. బేకరీలలో న్యూఇయర్ కేక్‌లకు డిమాండ్ పెరిగింది. న్యూఇయర్ వేడుకల


బుట్టాయగూడెంలో ఏర్పాటు చేసిన రంగుల షాపు

నేపథ్యంలో పోలీసులు ఆంక్షలు విధించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, ద్విచక్రవాహనాలకు సైలెన్సర్స్‌ను తీసివేసి ప్రజలకు ఇబ్బంది కలిగేలా సౌండ్‌చేస్తూ తిరగడం వంటివి చేస్తే కఠినచర్యలు చేపడతామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. అంతేకాక సాయంత్రం 6 గంటల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

టి.నరసాపురం: మహిళాభ్యున్నతి కోసం తపన స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయం అని మహిళలు పేర్కొంటున్నారు. ఆదివారం కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని తిరుమలదేవిపేట, శ్రీరామవరం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సంస్థ నిర్వాహకురాలు రేణుక చౌదరి మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు, ఆర్థికంగా ఎదిగేందుకు తపన స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్ని రకాల కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే తిరుమలదేవిపేట, శ్రీరామవరం గ్రామాల్లో 90 రోజుల పాటు కుట్టుశిక్షణ నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కుట్టు శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందిన 80 మందికి


కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రఘు, అజయ్, శివ, గణేష్, సేవా సంస్థ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో ముందుండాలి

లింగపాలెం: క్రీస్తు బోధనల ప్రకారం ఇతరులకు ప్రేమను పంచి అందరూ సహోదరభావంతో కలసిమెలసి జీవించాలని ఏలూరు బిషప్ పొలిమెర జయరావు అన్నారు. ఆదివారం ములగలంపాడు విచారణలో ఫాదర్ ఈతకోట జీవరత్నం ఆధ్వర్యంలో పవిత్ర కుటుంబ మహోత్సవ కార్యక్రమం అత్యంతంగా ఘనంగా నిర్వహించారు. బిషప్ జయరావుచే ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిషప్ జయరావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో దైవ సేవకులు ముందుండాలన్నారు. దైవ సందేశాన్ని పరిపూర్ణంగా ఆచరించినప్పుడే నిజమైన భక్తులవుతారన్నారు. అందరూ తోటివారి పట్ల సోదరభావంతో మెలగాలన్నారు. యువత సమాజాభి వృద్ధికి


ములగలంపాడు దేవాలయంలో ప్రార్థన చేస్తున్న ఏలూరు బిషప్ పొలిమెర జయరావు

చొరవ చూపాలన్నారు. సంఘస్తులు, ఫాదర్లు, పాస్టర్లు బిషప్ జయరావును ఘనంగా సన్మానించారు. ఫాదర్ పి.బాల, ఫాదర్ జీవరత్నం, ఫాదర్ జ్ఞానప్రకాశం,సంఘపెద్దలు,విశ్వాసులు పాల్గొన్నారు.

మానవత సహాయం

పోలవరం రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. పోలవరంలోని నూతనగూడెంలో పక్షవాతంతో బాధపడుతున్న తిరుమలశెట్టి సూర్యచంద్రంకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు జి.గణేష్,, వి.చంద్రయ్య, కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, ఆకుల నరసింహమూర్తి, పి.పోశిబాబు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ వార్షికోత్సవం

దెందులూరు: కోస్తా జిల్లాలో కొలిచిన వారింట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దెందులూరు మండలం గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ 67వ వార్షికోత్సవ ఉత్సవాలు ఫిబ్రవరి 16 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తారని గాలాయగూడెం అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ తెలిపింది. ఆదివారం ఆలయ ఆవరణలో ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కమిటీ సమావేశం నిర్వహించి తేదీలను ఖరారు చేసింది. ఉత్సవాలకు వచ్చే భక్తులు జంగారెడ్డిగూడెం రూట్‌లో వీఆర్వో విష్ణు ఇంటి నుంచి నేరుగా అమ్మవారి ఆలయానికి వచ్చేలా దాతలు గంటా కోటేశ్వరరావు, అచ్చమ్మ దంపతుల ఆర్థిక సాయంతో రోడ్డు నిర్మించామన్నారు. ఇకపై భక్తులు ఎటువంటి మలుపులు తిరగకుండా గాలాయగూడెం రాగానే మొదటి రోడ్డులో నుంచే నేరుగా అమ్మవారి ఆలయానికి రావచ్చని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి: మండలంలోని మేటిశెట్టివారిపాలెం గ్రామ శివారులోని పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై కె.ప్రసాద్ ఆధ్వర్యంలో చింతలపూడి పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.24550 నగదు, 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనలు పాటించాలి

భీమడోలు: నూతన సంవత్సర వేడుకలను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకుంటూ నిబంధనలను పాటించి పోలీసులకు సహకరించాలని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ ఆదివారం రాత్రి తెలిపారు. వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు, మ్యూజిక్ సిస్టంలు, ఉపయోగించే తరుణంలో విధిగా ముందుస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో లిక్కర్ సేవించడం పేకాట ఆడడం నిషేధమన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాత్రి 10 గంటలకు తర్వాత ఎటువంటి మ్యూజిక్ సిస్టమ్‌ను వాడవద్దన్నారు. ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువతను, రోడ్డును చిందులు తొక్కే మందుబాబులను ఇష్టానుసారంగా వాహనాలను నడిపే వారిని చిత్రీకరించేందుకు వీడియో కెమెరాలను, డిజిటల్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు.

క్లుప్తంగా

నాగమణి బుద్ధదేవ్‌కు పురస్కారం



పురస్కారం అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నృత్య గురు ఎ.నాగమణి బుద్ధదేవ్ బెంగళూరులో పురస్కారం అందుకున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీ రాజరాజేశ్వరి సాంస్కృతిక కళా సంస్థ నవసంధి ఆలయ సంప్రదాయ నృత్య ప్రదర్శనలో భాగంగా నాగమణి బుద్ధదేవ్ నృత్య రంగానికి చేసిన విశిష్ట సేవలకు గానూ ఆమెకు ఆత్మీయ గౌరవ సత్కార్ పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు శనివారం బెంగళూరులోని చౌడప్ప మెమోరియల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కర్ణాటక పూర్వ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సీఎన్ అశ్వత్ నారాయణ, వేదాంతం రామలింగ శాస్త్రి, రాజరాజేశ్వరి సాంస్కృతిక కళాశాల నిర్వాహకులు నాట్య గురు వీణామూర్తి విజయ్ తదితరులు నాగమణి బుద్ధదేవ్‌కు పురస్కారం ప్రదానం చేశారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి



నాలుగు మండలాల యువజన అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షులు వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టి ప్రణాళికతో కృషి చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు నూతనంగా నియమితులైన యువజన విభాగ అధ్యక్షులు, నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. దెందులూరు మండల అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్, పెదపాడు మండల గోరింకల జగదీష్, ఏలూరు రూరల్ శేష్ కుమార్, పెదవేగి చిట్టిబొమ్మ రంగారావు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని కలిశారు. వారిని ఎమ్మెల్యే అభినందించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.

జగన్ పాలన సువర్ణాధ్యాయం

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధిలో సువర్ణ అధ్యాయం నడుస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ చక్కటి ఆయురారోగ్యాలను, సుఖసంతోషాలను, భోగభాగ్యాలను, అష్టైశ్వర్యాలు పొందాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గ ప్రజలందరికీ 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు





నాట్యాచారిణి దివ్య సుహాసిని శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య విన్యాసం, వంగల శ్రావణి బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 5 గంటలకు నగరానికి చెందిన హరి శ్రీనివాస శాస్త్రి సీతా దర్శనం అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. 6 గంటలకు నగరానికి చెందిన దివ్య సుహాసిని శిష్య బృందం, 7 గంటలకు వంగల శ్రావణి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఆలయ అర్చకులు కిశాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రాష్ట్రంలో ఉద్యోగుల పక్షపాత పాలన



ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఉద్యోగుల పక్షపాత పాలన కొనసాగుతోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులను తోబుట్టువుల్లా ఆదుకుంటున్నారని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇడా చైర్మన్‌గా నూతనంగా నియమితులైన బొద్దాని శ్రీనివాస్‌ను ఆదివారం వైఎస్‌ఆర్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు రీజియన్ ఏలూరు డివిజన్ కార్యవర్గ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఘన విజయం సాధించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాబోతోందని, ఈ విజయంలో ఉద్యోగులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా ముఖ్యమంత్రి జగన్‌కు మద్దతు తెలిపి వచ్చే ఎన్నికల్లో పట్టం కడితే ఉద్యోగులపై వరాల జల్లులు కురిపిస్తారన్నారు. విద్యుత్ ఉద్యోగులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే తన స్థాయిలో వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు బొద్దానికి పుష్పగుచ్ఛాలు అందచేసి దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. బొద్దానిని కలిసిన వారిలో యూనియన్ డిస్కం అధ్యక్షుడు ఏజీ సత్యనారాయణ, రీజినల్ అధ్యక్షుడు సానా బలుసుబాబు, రీజినల్ కార్యదర్శి కుల రాజేంద్ర ప్రసాద్, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు జీవీవీ రమా శంకర్, సుంకర శ్రీను, కళ్యాణం సూర్యనారాయణ, కోడి మునలయ్య తదితరులు ఉన్నారు.

బీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ శ్యామ్‌సుందర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం ప్రగతి సాధించడంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ సూచించారు. ఆదివారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణకు డీఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని ఉన్నత స్థానాల్లో నిలుపుతోందని, విద్యార్థులు వారి తల్లిదండ్రుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వాటిని అర్హులందరికీ అందేలా ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. అలాగే విద్యాభివృద్ధిలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడానికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ వాల్ క్యాలెండర్‌ను డీఈఓ శ్యామ్‌సుందర్, స్టిక్కర్ క్యాలెండర్‌ను సమగ్రశిక్ష సీఎంఓ జె.రవీంద్ర ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లిపో మనోజ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోసిపో సాల్మన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడిమెల్లి వెంకటేశ్వరరావు, చేడే ధర్మలింగం, కోశాధికారి గుండె వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బొల్లిపో కృపాకరణ్, మహిళా కార్యదర్శి వాసే ధనకాంత తదితరులు పాల్గొన్నారు.

జూద క్రీడలపై నిషేదాజ్ఞలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి

ఏలూరు(మెట్రో): ప్రజలందరూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల ప్రకారం ఏలూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కోడి పందేలు, జూదం, గుండాట ఆడటంపై నిషేధం ఉన్నందున, ఆదేశాలను ఉల్లంగించిన వారిపై, వారికి సహకరించిన వారిపైనా చర్యలు తీసుకోనున్నట్లు ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి సంపాదించిన సంపాదనను వృధా చేయకుండా సంక్రాంతి పండుగను బంధువులు, కుటుంబ సభ్యులతో జరుపుకోవాల్సిందిగా ఆర్డీవో కోరారు. నిషేదాజ్ఞలు మీరి కోడి పందేలు, జూదం, గుండాట తదితర జూద క్రీడలు ఆడటం, నిర్వహణ, ప్రోత్సహించడం చేస్తే తీవ్రమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై ప్రజలందరూ అధికారులకు సహకరించి, జూదక్రీడలకు సంబంధించి వివరాలు తెలిస్తే తహసీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శిగాని సమాచారం ఇవ్వాలని ఆర్డీవో కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఏలూరు (టూటౌన్): చేపల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఫంగస్ చేపలు సాగు చేస్తున్న రైతులు గత రెండేళ్లుగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లీజులు, మేతలు, మందులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయని చెప్పారు. పెట్టుబడికి అనుగుణంగా రైతులకు ధర రావడం లేదన్నారు. ఫంగస్ చేపల ఎగుమతులు కూడా భారీగా తగ్గిపోయాయని చెప్పారు. ఫంగస్ ఇతర చేపలు సాగు చేస్తున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు.

జాయింట్ కలెక్టర్ శుభాకాంక్షలు

ఏలూరు(మెట్రో): నూతన సంవత్సరం సందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో అందరికీ అంతా మంచి జరగాలని, ప్రతి ఒక్కరి జీవితంలో 2024 సంవత్సరం కాంతులు నింపాలని కోరుతూ జిల్లా ప్రజలు, అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలి



పాస్టర్లను సన్మానిస్తున్న వ్యాపారవేత్త నారా శేషు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలుగుతూ సమాజంలోని సాటి వారికి సహాయం చేయాలని వ్యాపారవేత్త నారా శేషు సూచించారు. ఆదివారం రాత్రి స్థానిక జ్యూట్‌మిల్ వద్ద ఉన్న ధర్మ భేరి ప్రాంగణంలో క్రిస్మస్ వేడుకల ముగింపు, నూతన సంవత్సర ప్రారంభ వేడుకలు హోటల్ ఎస్ గ్రూప్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జన్మను సార్థకం చేసుకుంటూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలకు తెగించి వైరస్ సోకిన వారికి చికిత్స అందించిన నర్సుల త్యాగం మరువరానిదన్నారు. అటువంటి వారిని గుర్తించి వారికి సమాజంలో సముచిత గౌరవం కల్పించాలనే లక్ష్యంతో తమ సంస్థ ఆధ్వర్యాన 100 మంది నర్సులను సన్మానిస్తున్నామన్నారు. అలాగే తమ ప్రార్థనల ద్వారా అనేక మందిలో పరివర్తన తీసుకువచ్చి సమాజంలో శాంతి స్థాపనకు విశేష కృషి చేస్తున్న క్రైస్తవ పాస్టర్ల సేవలను సైతం మరువరాదన్నారు. ఈ సందర్భంగా 100 మంది పాస్టర్లను సన్మానించారు.

క్లుప్తంగా

నేడు నగరంలో మహిళా ఉద్యోగుల ఆధ్వర్యాన న్యూ ఇయర్ వేడుకలు

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ మహిళా ఉద్యోగుల సంక్షేమ సమితి ఆధ్వర్యాన సోమవారం నగరంలో పలు చోట్ల నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా కన్వీనర్ మన్నవ యామిని, కో కన్వీనర్ గొర్లి స్వాతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక జీవీ మాల్ సెంటర్‌లో, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సెంటర్‌లో షాపులు, మాల్స్‌లో పనిచేసే మహిళా కార్మికులు, కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు ఈ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ వేడుకల్లో మహిళా ఉద్యోగులు, మహిళా కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

మెట్టలో మామిడి పూతకు మంచు దెబ్బ

- దిగుబడిపై రైతుల ఆందోళన
- సస్యరక్షణ చర్యలు మేలంటున్న ఉద్యానాధికారులు


మెట్ట ప్రాంతంలో పూతమీద ఉన్న లేత మామిడి తోట


తేనెమంచు పురుగు సోకిన మామిడి పూత


ఎండీ షాఫియ ఫర్హీన్, ఉద్యానాధికారిణి, చింతలపూడి

చింతలపూడి: వాతావరణ ప్రతికూల ప్రభావంతో ఈ ఏడాది జిల్లాలోని మామిడి రైతులకు మామిడి పూత, పిందెలను రక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంవత్సరం పొడవునా తోటల్లో చేపట్టే యాజమాన్య చర్యలన్నీ ఒక ఎత్తయితే ఇప్పుడు పూత సమయంలో పాటించే యాజమాన్యం ఒక ఎత్తు. పూత సమయంలో తోటల్లో పురుగులు, తెగుళ్లు ఆశించకుండా రైతులు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవాలి. సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపడితేనే మంచి దిగుబడులు సాధించవచ్చు. సాధారణంగా 25–30 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, పొడి వాతావరణం మామిడి తోటలకు అనుకూలం . ఈ దశలో పూత ఎక్కువగా రావడానికి అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో మామిడి తోటల విస్తీర్ణంలో కృష్ణా జిల్లా తరువాత చింతలపూడి ప్రాంతం ద్వితీయ స్థానంలో నిలుస్తుంది. ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో మామిడి తోటలు చాలా చోట్ల ముందుగానే పూతకు వచ్చాయి. అయితే గత రెండు వారాలుగా విపరీతమైన మంచు కురుస్తుండటంతో పూత పూసిన ప్రాంతంలో మామిడి పంట మంచు దెబ్బకు విలవిల్లాడుతోంది. దీంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సంవత్సరం అంతా సస్యరక్షణ చేపట్టి పంటను కాపాడుకుంటూ వస్తుంటే మంచు కారణంగా పూత, పిందె మాడిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతికూల పరిస్థితుల వల్లనే

ఈ సంవత్సరం వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా మామిడితోటలు కొన్ని చోట్ల పూయలేదని అధికారులు చెబుతున్నారు. వచ్చిన పూతను కాపాడుకోవడానికి రైతులు ఇప్పట్నుంచీ సరైన సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ లేదా 50 గ్రాముల యూరియా ఒక లీటరు నీటిలో కలిపి చెట్లకు స్ప్రే చేస్తే ఫలితం ఉంటుందని ఉద్యానాధికారిణి ఎండీ షాఫియ ఫర్హీన్ తెలిపారు. మామిడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

తేనే మంచు పురుగు నివారణ ఇలా...

ప్రస్తుతం మామిడి పూతపై తేనె మంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. లేత పూ మొగ్గలు ప్రారంభంలో తేనె మంచు పురుగు ఆసిస్తుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ (కాన్ఫిడార్) ద్రావణం 10 లీటర్ల నీటికి 3 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలి. లేదా థయో మిటాక్జిమ్ 10 లీటర్ల నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేసినట్లయితే పురుగు ఉధృతి తగ్గుతుంది.

తామర పురుగులు

ఇవి కొత్త చిగురు, పుష్ప గుచ్ఛాలు, పిందెలపైన అసంఖ్యాకంగా చేరి గోకి రసం పీలుస్తాయి. వీటి నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లు, లేదా 03 మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు

చల్లని రాత్రులు, పగటి వాతావరణంలో పూత, పిందెలపై తెల్లని పొడిలాంటి బూజు ఏర్పడుతుంది. ఈ శిలీంద్రం ఆశించడం వల్ల పూత, పిందెలు రాలి పోతాయి. వీటి నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా ట్రైడీమార్ఫ్ 1 మిల్లీ లీటర్ లేదా డైనోకాప్ 1 మిల్లీ లీటర్, లేదా హెక్సకోనజోల్ 2 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వల్ల బూడిద తెగులును నివారించవచ్చు.



వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


పొంగుటూరు సీయోను చర్చిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలలో భాగంగా పొంగుటూరు సీయోను ప్రార్థనా మందిరంలో ఆదివారం వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేశారు. పాస్టర్ మల్లిపూడి సువర్ణరాజు, ప్రేమలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులతోపాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. న్యూ ఇయర్, సంక్రాంతి వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా బృహత్కర సంక్షేమ పథకాలను అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దైవ కృప ఉండాలని పాస్టర్లు సామూహిక ప్రార్థనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న చిన్నారులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడడాన్ని ప్రశంసిస్తూ అతిథులు వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గంగిరెడ్ల మేఘలాదేవి, సర్పంచ్ పసుపులేటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గేలం శ్రీను, తోట శ్రీను, కైకవరపు గోపి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం రూరల్: చక్రదేవరపల్లికి చెందిన పదిలం నర్సయ్య (40) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నర్సయ్య మేకలు మేపుకుంటూ జీవిస్తుంటాడు. ఈనెల 30న నర్సయ్య మేకల అరుగుదలకు వాడే మందు సేవించాడు. దీంతో వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఫిట్స్ రావడంతో నర్సయ్య మృతి చెందాడు. అతనికి మతిస్థిమితం సరిగా లేదని ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

కోమటిలంకలో కోడి పందేలు

ఏలూరు రూరల్: ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామంలో ఆదివారం కోడి పందేలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకుని కైకులూరు నుంచి పెద్ద ఎత్తున పందెంరాయుళ్లు కోళ్ళు పట్టుకుని గ్రామానికి చేరుకున్నారు. దీంతో కోడి పందేలు విషయం బయటకు తెలిసిపోతుందని భావించి, నిర్వాహకులు గ్రామ శివారున 50 ఎకరాల చెరువు వద్దకు బరి మార్చారు. సాయంత్రం 4 గంటల వరకూ లక్షల రూపాయల్లో పందేలు కొనసాగాయి. గ్రామానికి ఉన్న ఒకే ఒక్క పడవ మార్గం ద్వారా పందెంగాళ్ళు పెద్ద ఎత్తున గ్రామానికి రాకపోకలు సాగించడంతో గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.







రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


రైతులకు జలకళ మోటర్లు అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: రైతు సంక్షేమ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. ఆదివారం మండలంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులైన సన్నా, చిన్నకారు రైతులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న జలకళ మోటార్లను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి ఏడాది రైతు భరోసా అందిస్తూ, రాయితీల ద్వారా విత్తనాలు పురుగు మందులు ఇవ్వడంతో పాటు, పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కరిపోతు అనూష, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు ఎస్కే కరీముల్లా, ఎంపీడీవో కె.శ్రీదేవి, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.





ఇరువర్గాల మధ్య ఘర్షణ

జంగారెడ్డిగూడెం రూరల్: పొలంలోని సాగునీటి బోరు విషయంలో ఇరు వర్గాల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారి తీసింది. కేతవరం గ్రామానికి చెందిన నరెడ్ల ముక్కయ్య, నాగేశ్వరరావు పొలాలకు వారి కుటుంబ సభ్యులకు చెందిన పొలాల మధ్య నీటి వాటాలకు సంబంధించి గత కొన్నాళ్లుగా వివాదం జరుగుతోంది. ఆదివారం పొలంలో ఉన్న తమపై కొంతమంది వచ్చి ఇనుప రాడ్లుతో దాడి చేసినట్లు ముక్కయ్య, నాగేశ్వరరావు తెలిపారు. గాయపడిన ముక్కయ్య, నాగేశ్వరరావులను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇద్దరిని ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

















